


# క్షీరసాగర మథనం

- నిర్మలాదిత్య

*(గత సంచిక తరువాయి)*

వినోద్ నవ్వాడు. "పి. ఎల్. మీరు చతురులు. రీజినల్ మేనేజర్ మీ మాట వింటారు. మీరు వేగంగా మీ వ్యాపారం విస్తరిస్తూ, లిమిట్ కంటె ఎక్కువ డబ్బులు వాడుకోవాలనుకోవడం, నేను తరచు అడ్డు పడడం మీకు గుర్తే ఉంటుంది. అందుకే రీజినల్ మేనేజర్ మీ అక్కౌంట్లను చెన్నై మార్పించారు. ఇక్కడి బ్రాంచి మేనేజర్, రీజినల్ మేనేజర్ మీకు, నా లాగా సమస్యలు సృష్టించరు" అన్నాడు వినోద్.

"అది నిజమేననుకో. కానీ నీలాంటి వాడికి ప్రమోషన్ రాకపోవడం, నాకు ఆశ్చర్యం గా ఉంది" అన్నాడు పి.ఎల్.

"నాకు ప్రమోషన్ రాక పోవడానికి కారణం, మీ అకౌంట్లు కాదు. మీకు గుర్తు ఉండే ఉంటుంది. లోన్ మేళా అంటూ ఒక్క ఫంక్షన్ లోనే మంత్రి ద్వారా మా బ్రెంచీ నుంచి కూడా జెర్సీ ఆవులు, కుట్టు మెషీన్లు పంచారు. రీజినల్ మేనేజర్ నుంచి తెగ ఒత్తిడి. ఒక్క రోజులో అంత మంది అప్పు అవసరం ఉన్నవాళ్లు, ఆ తీసుకున్న అప్పు తీర్చ గలిగే వారిని గుర్తు పట్టడం కష్టం అని పోరాడాను. మంత్రి వర్గం వాళ్లు, ఊరి పెద్దలను పిలిచి, ఆ ఊళ్లనుంచి అప్లికేషన్ ఫారం లు పూర్తి చేయించి బ్రాంచిలో అప్పగించారు. మీరు కూడ, పక్క ఊరు పెద్ద ఏలుమలై ని పంపించారు. ఊరి పెద్దలు తెలిసినా, అప్పుతీసుకొనే వారి గురించి ఏమి తెలియదు. ఇలాంటి లోన్లు మీద పని చేయాలంటే, కనీసం ఓ వారమైన పడుతుంది అని చెప్పాను. ఊరి పెద్దలను గుర్తుంచుకో. ఊరికి పోయి ఆ పెద్ద ను కలిస్తే, అప్పు తీసుకున్న వాళ్లను పిలిపించి, నీ కు అప్పులు కట్ట డానికి సహాయ పడతారు అని చెప్పి, బ్యాంక్ నుంచి కుట్టు మెషీన్లు, ఆవులు అమ్మే వారికి బ్యాంక్ నుండి డబ్బులు ఇప్పించేశారు. అన్ని మెషీన్లు, ఆవులు అప్పటి కప్పుడు ఎక్కడ దొరుకుతాయి. వార్తా పత్రిక ఫోటో ల కని ఓ పది మెషీన్లు, ఐదు ఆవులు స్టేజి మీద పంచారు. మిగిలిన వారికి మళ్ళి మెషీన్లు, ఆవులు పంచుతామని, కాగితాలు పంచారు. ఆ కాగితాలు బ్యాంక్ కు తెచ్చిన వారికంతా అప్పులు ఇచ్చారు. లోన్ మేళా అయ్యిన తరువాత, గ్రామ పెద్దలు, అప్పు

తీసుకున్న వారు, మెషీన్లు, ఆవులు అమ్మిన వారు, ఎవ్వరు దొరకలేదు. అంత తొందర చేసి, నా చేత అప్పులు ఇప్పించిన రీజినల్ మేనేజర్, ఎలా అప్పులు ఇచ్చావు అని సంజాయిషీ అడిగారు. ఆ గందగోళం ఇంకా నడుస్తూనే ఉంది" అన్నాడు వినోద్.

ఇదంతా ఆసక్తిగా వింటున్న మహేష్," నాకు ఈ లోన్ మేళాలు గుర్తుకు వస్తున్నాయి. అప్పుడు నేను సి.ఏ. కు చదువుతున్నాను. మావూరి పెద్ద కు కూడా ఆ లోన్ మేళా ద్వారా డబ్బు ముట్టింది. ఎక్కువ డబ్బు రాజకీయ నాయకులు, ఊరి పెద్దలే తినేసారు. అప్లికేషన్ల మీద వేలి ముద్రలు వేసిన వారికేమి దొరకలేదు. మీ లాంటి బ్యాంక్ వాళ్ళు లోన్ డబ్బులు వసూలకని ఊరు వస్తే ఇంట్లో ఉన్నా, లేరనే చెప్పించే వాళ్ళు ఆ ఊరి పెద్దలు" నవ్వుతూ అన్నాడు.

"అలా చేస్తున్నారని, నేనూ ఊహించాను. కానీ ఇంత మంది కుమ్మక్కైన ఈ సమస్యను పరిష్కరించడం నాకు చేత కాలేదు. నాకు ప్రమోషన్ రావడం సందేహమే. నేనే మరో మార్గం వెదుక్కోవాలి. అన్నట్టు, చెన్నైలో లెదర్ ఎక్సపోర్ట్స్ ఎక్సహిబిషన్ ఈ వారం జరుగుతున్నది. మీరు ఒక సారి చూసి రండి. మీ వ్యాపారానికి ఉపయోగ పడుతుంది" అంటూ వినోద్ సెలవు తీసుకున్నాడు.

వినోద్ వెళ్లి పోయిన తరువాత, పి.ఎల్. ఈ అబ్బాయిలో ఏదో స్పార్క్ ఉంది. తనను అణచి ఉంచడం సాధ్యం కాదనుకున్నాడు. వినోద్, మహేష్ మధ్యలో ఎంత తారతమ్యం. మహేష్ తాను చెప్పిన ప్రతీది, ఎలాంటి మీమాంసలకు లోను కాకుండా వెంటనే అమలు పరుస్తాడు. మహేష్ లాంటి వారు తనకు చాలా అవసరం. తన అంచన తప్పు కాకపోతే, మహేష్ కంపెనీ తో బాటు ఎదుగుతాడు. ఆ ఉద్దేశ్యం తోనే పి.ఎల్. మహేష్ తో వ్యాపారంలో అన్ని విషయాలు పంచుకుంటాడు. దానికి తగట్టు మహేష్ పి.ఎల్. ను తరచు ప్రశ్నలు వేసి, వ్యాపార మెళుకువలు అట్టే పట్టేస్తాడు.

"పి.ఎల్. సార్, ఓ సందేహమండి. ఇక్కడి ఫీల్డ్ ఆఫీసర్ కు, బ్రాంచి మేనేజర్ కు ఏదో గిఫ్ట్ ఇచ్చారు. వినోద్ కి కూడా ఇవ్వ ప్రయత్నించారు. రీజినల్ మేనేజర్ ను మాత్రం వదిలేసారేమి?" అని అడిగాడు మహేష్.

"నీ దగ్గిర పని చేస్తున్న హేమ ఎవరనుకున్నావు. రీజనల్ మేనేజర్ అక్క కూతురు. ఆవిడ జీతం ఆవిడ చేస్తున్న పని కంటే ఓ రెట్టు ఎక్కువే. నెల నెలా మామూలు ఇచ్చినట్లే" నర్మ గర్భంగా నవ్వాడు పి.ఎల్.

–5 –

సెయింట్ పీట్, ఫ్లోరిడా

మే, 2014

బెత్ తో మీటింగ్, ఇంకో ఐదు నిమిషాలలో. మధ్యాహ్నం ఓ ఎగ్జిక్యూటివ్ లు ఉన్న పెద్ద గుంపుతో మీటింగ్ ఉంది. దానికి తయారి, ఇది. మీటింగ్ హోస్ట్ గా ఓపెన్ చేసాడు. మీటింగ్ హోస్ట్ గా ఓ ఐదు నిమిషాలు ముందే మొదలు పెట్టడము మంచిదని, అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు విశ్వం. సాంకేతిక సమస్యలు ఉంటే, పరిష్కరించుకోవచ్చు. ముందే మీటింగ్ జాయిన్ అయిన వారితో మాట్లాడడం వల్ల సాన్నిహిత్యం పెరగడమే కాక, మీటింగ్ లో సమస్యల కు పరిష్కారమూ తొందరగా దొరక వచ్చు.

బెత్ మీటింగ్ సమయానికి రాలేదు. ఓ మూడు నిమిషాల తరువాత చాట్ లో పింగ్ చేసి, ఇదిగో జాయిన్ అవ్వుతున్నానని మరో 2 నిమిషాల తరువాత జాయిన్ అయ్యింది. గుడ్ మార్నింగ్ వంటి సంభాషణ తరువాత

"దేని గురించి ఈ మీటింగ్, ఎజెండా అదీ పంపలేదా?" అంటూ కొంచెం తొందరపాటు కంఠం తో అంది.

"నిన్ననే పంపించాను బెత్" అన్నాడు విశ్వం.

"నాకు వందల కొద్ది మెయిల్స్ వస్తుంటాయి. ఏదైనా ఇలాంటి ముఖ్యమైన మెయిల్స్ పంపిస్తే, నాకు మెయిల్ తో బాటు చాట్ లో పింగ్ చేసి చెప్పు" అంటూ బెత్, తన ఇన్బాక్స్ వెదకటంలో పడిపోయింది.

"ఒంటి గంట పదకొండు నిమిషాలకు పంపించాను బెత్. సబ్జెక్ట్ లైన్ మీద 'మీటింగ్ ఎజెండా – డ్రాఫ్ట్ ' అని డ్రాఫ్ట్ డెక్ కూడా పంపించాను" అన్నాడు విశ్వం.

"ఇదిగో దొరికింది. ఫైల్ పేరేమిటి. ఇలా పెట్టావు. నేను ఇది వరకే చెప్పాను వెర్షన్ నంబర్ ఫైల్ చివర ఉండాలని" అంది బెత్.

డెక్ ఇంత వరకు చదవలేదు, ఇమెయిల్ కూడా ఇప్పుడే చూసింది అని తెలిసేసారికి, విశ్వంకి తెగ కోపం, వచ్చేసింది. కానీ కోపాన్ని అదుపులో పెట్టుకుని,

"ఫైల్ పేరే కదండీ. నేను మధ్యాహ్నం మీటింగ్ కి మీరు చెప్పినట్లే పేరు మార్చి పంపిస్తాను. ఇప్పుడు ఈ డెక్ కూడా ఒక సారి, చదివి మార్పులు చేర్పులు చెబితే, అప్డేట్ చేసి, పంపిస్తాను." అన్నాడు విశ్వం.

ఇక మిగిలిన సమయం అంతా బెత్ ఈ బొమ్మ పైకి పంపించు, ఈ గ్రాఫ్ చిన్నగా ఉంది, ఆ ఫాంట్, అక్షరాల వేరే రంగులో ఉండాలి, లాంటి పై పై సవరణలు తప్పితే, విషయాన్ని అర్థం చేసుకున్నట్టు అనిపించలేదు.

తానే బెత్ ను ఓ సారి ఐదో నెంబర్ స్లయిడ్ ను చూడమన్నాడు.

"బెత్ చూసారా, ఈ పిరమిడ్ కంపెనీ లో ట్రాన్సక్షన్స్ అనుమానస్పదంగా ఉన్నాయి అని మన సాఫ్ట్వేర్ ఫ్లాగ్ చేసి మన ఆడిట్ కని పంపించింది. ట్రాన్సక్షన్స్ వాళ్లు చేసే వ్యాపారానికి అనుగుణంగానే ఉన్నాయి. కానీ ఎందుకైనా మంచిదని, ఆ కంపెనీ తో అనుబంధం ఉన్నా కంపెనీలను ఓ సారి పరిశీలించాను. అందులో కేసినోలు, విదేశాలలో ఉన్న కంపెనీ ల పేర్లు కనిపిస్తున్నాయి. ఇంకా కొన్ని రోజులు ఆ అనుబంధ కంపెనీలు కూడా పరిశోధన చేసి, నిజా నిజాలు తెలుసుకోవాలి. మీరేం అంటారు?" అన్నాడు విశ్వం.

బెత్ కు విశ్వం చెప్పిన మాటలు నచ్చలేదని, ముఖం చూస్తూనే తెలిసిపోతుంది.

"మన స్కోప్ ఏమిటీ విశ్వం? ఈ  ట్రాన్సక్షన్స్ చూస్తే చాలు. నీ డెక్ , అలాగే నీవు ఈ మధ్యాహ్నం మాట్లాడే మాటలు, ఈ ట్రాన్సక్షన్స్ కి పరిమితమౌతే చాలు.  ఎక్కువ మాట్లాడి, ఆ అనుబంధ సంస్థ ల పేర్లు తెచ్చి, ఈ మధ్యాహ్నం మీటింగ్ ఓ గందరగోళం చేయొద్దు" అంటూ మరో మీటింగ్ ఉందంటూ, హడావిడిగా వెళ్లి పోయింది.

విశ్వం మీద ఒక్క సారి చన్నీళ్ళు చల్లినట్లు అనిపించింది. తను ఇంత వరకు కనుక్కొన విషయాలు తనకు గుర్తింపు, బ్యాంక్ కు కావలసిన రక్షణ కల్పిస్తాయి అనుకున్నా డు. బెత్ అలా వెళ్లి పోవడం అంటి క్లైమాక్స్ లాగా అనిపించింది. ప్రస్తుతం, చేసేది ఏమి లేదని మధ్యాహ్నం కి కావలసిన మార్పు,  చేర్పుల మీద పడిపోయాడు.

ఓ గంట తరువాత ఫోన్ వచ్చింది. విశ్వం చేస్తున్న పని ఆపి, వైబ్రేట్ అవ్వుతున్న ఫోన్ చూసాడు. అమ్మాయి లక్ష్మీ ఫోన్ చేస్తున్నది.  లక్ష్మీ నుండి ఫోన్ వస్తే విశ్వం వెంటనే ఎత్తే స్తాడు. ఆ సంగతి ముగ్గురికి తెలుసు. డ్రైవ్ చేస్తున్నప్పుడు లక్ష్మి ఫోన్ చేస్తే, అలా ఎత్తే హడావుడిలో, ఎక్కడైనా విశ్వం కి ఆక్సిడెంట్ అవ్వుతుందేమోనని సీతకు ఆదుర్ధ. విశ్వం, తాను ఫోన్ దూరంలోనే ఉన్నానన్న నమ్మకం లక్ష్మీ కి ఉండాలని ఆశయం. లక్ష్మికి నాన్న ఫోన్ చేస్తే ఎత్తుతారని గట్టి నమ్మకం.

"హలొ బంగారు, ఎలా ఉన్నావమ్మా?" అంటూ ఫోన్ తీసి ఆప్యాయంగా పలకరించాడు.

"ఈ శుక్రవారం సాయంత్రం ఫ్రీ నే గా నాన్న, నా ప్రాజెక్ట్ ప్లాన్, ఫైనాన్స్ మరో సారి రివ్యూ చేయాలి" అంది లక్ష్మీ.

"దానికేం తప్పకుండా చేద్దాం.  ఆ వివరాలు ముందే పంపించు" అన్నాడు విశ్వం.

లక్ష్మి కి అన్ని విషయాల పైన ఆసక్తి.  సీత, తనూ లక్ష్మికి ఏ కొదువ రాకుండా అల్లారు ముద్దు గా పెంచారు.

సీత గుర్తుకు వచ్చింది విశ్వం కు. ఇన్ని రోజులు సాఫీగా జరుగుతున్న సంసారంలో చిచ్చు పెట్టడానికి తనకు కాన్సర్ వచ్చిందా , అన్న అనుమానం మోదలయ్యింది.

'ఎలిఫెంట్ ఇన్ ది రూమ్' లాగా దానిని చూస్తూ దాని గురించి మాట్లాడకుండా ఉండలేరు. మాట్లాడితే సీత డిప్రెస్ అవ్వుతుందేమోనని విశ్వం బాధ. తాను అలా ఆ సమస్యను కప్పి పుచ్చి కాలక్షేపం చేద్దామంటే సీత పడనివ్వదు. తాను నవ్వుతూ, తన చుట్టూ ఉన్నవారిని నవ్విస్తూ బిందాస్ గా తిరిగే సీత ఈ కాన్సర్ విషయం వచ్చేసరికి ఆలోచించి అలా చేద్దాం, ఇలా చేద్దాం అంటూ ధైర్యంగా మాట్లాడడం, విశ్వం కు కొత్తగానే ఉంది. సీతలో ఈ కోణం చూడలేదే అని విశ్వం ఆశ్చర్యపోతూనే వుంటాడు.

"హలో సీత? ఏమి చేస్తున్నావు" అన్నాడు విశ్వం.

"హా బాగానే ఉన్నాను. మీరేం చేస్తున్నారు?" ప్రశ్నించింది సీత.

"ఇంకా నీ చిరు కోపం వినిపిస్తూనే ఉంది" విశ్వం కొంటెగా అన్నాడు.

సీత ముక్తసరి సమాధానాలు, విశ్వం కు నచ్చలేదు.

"ఏప్పుడూ గలగల మాట్లాడే నువ్వు ఇలా బొత్తిగా మాటలు తగ్గించేయడం బాగాలేదు. నీకు నేను బయాప్సీ చేసుకోవాలి కదా. డాక్టర్ సురేష్ తో మాట్లాడుతాను. అతను మన బంధువు కూడా కదా" అన్నాడు విశ్వం.

డాక్టర్ అన్న మాట విన్న తరువాత సీత మళ్ళీ గలగల మాట్లాడము మొదలెట్టింది.

"సురేష్ నెగెటివ్ గా ఆలోచిస్తాడు. మన ఫ్రెండ్ వెంకటేసులతో మాట్లాడండి. కాదంటే ఇద్దరితో మాట్లాడండి. వారేం చెప్తారో విని మనమేమి చేయాలని ఆలోచిద్దాం" అంది లక్ష్మి

అలా సీతతో పాటు, విశ్వం  కొంత సేపు స్వీట్ నథింగ్స్ మాట్లాడి, ఫోన్ కట్ చేసి,  రొటీన్ లో పడిపోయాడు.

మధ్యాహ్నం మీటింగ్ మామూలుగా గడిచిపోయింది. బెత్ చెప్పినట్లు, అనుబంధ కంపెనీల గురించి తన అనుమానం, తరువాత తీసుకోవలసిన చర్యలు, వాటికి లీడర్షిప్ ఆమోదం అడిగే స్లైడ్లు అన్ని తీసేసిన తరువాత డెక్ లో చర్చలకేమి మిగలలేదు.

ఇంటికి పోయేటప్పుడు, కార్ ఫోన్ ద్వారా ముందు డాక్టర్ సురేష్ కి ఫోన్ చేసాడు విశ్వం.

"సురేష్ ఏలా ఉన్నావు" అడిగాడు విశ్వం

"విశ్వం నువ్వెలా ఉన్నావు. ఇంటి కి డ్రైవ్ చేస్తున్నావా?" బదులిచ్చాడు సురేష్

"మన రొటీన్ లు తెలిసినవే కదా. నువ్వు బహుశా పేషంట్ల నోట్స్ రాస్తుంటావు" అన్నాడు విశ్వం.

"మామూలు రోజులైతే నువన్నది కరెక్ట్. ఈ రోజు ఆంకోలజీ ఫెల్లోషిప్ ఇంటర్వ్యూలు ఉన్నాయి. కొద్దిగా రొటీన్ తారుమార్తెయ్యింది. సరే చెప్పు ఏంటి విశేషాలు" అన్నాడు సురేష్.

"ఓ సెట్ బ్యాక్ సురేష్. సంవత్సరం చేసే ఫిజికల్స్ లో పి.ఎస్.ఏ. రీడింగ్ తేడా వచ్చింది. అది గత రెండు సంవత్సరాలు చూస్తున్నాము, పైకి కిందకి పోయి ఈ సారి ఏకంగా నాలుగు నుంచి ఎనిమిది కి పెరిగింది. యూరాలజిస్ట్ కి వెళ్తే బయాప్సీ అంటున్నాడు. నీ అభిప్రాయం ఏంటి?" అన్నాడు విశ్వం.

సురేష్ మాట్లాడడం మొదలెట్టాడు. ఎందుకో విశ్వం కు ఆ గొంతులో ఓ నిరాశ నిస్పృహ వినిపించింది.

"ప్రోస్టేట్ కాన్సర్ అన్న మాట. ఇది మన బంధు జనాలలో అడపా దడపా తలెత్తునే ఉంది. మా అన్నకు కూడా వచ్చింది, నీకు తెలుసో తెలియదో" అన్నాడు సురేష్.

"అవును. అందుకే నీ ఒపీనియన్ కూడా తీసుకుందామనుకున్నాను. బయాప్సీ లో నిర్ధారణ అయ్యితే, ఆపేరేషన్ చేస్తే పోతుంది గదా" అడిగాడు విశ్వం.

"నీవు యూరోలోజిస్ట్ కు పోయింది కరెక్ట్. వాళ్లే ఈ కాన్సర్ కు సరి అయిన డాక్టర్స్. నేను ఎక్కువ బ్లడ్ కాన్సర్ కేసులు చూస్తుంటాను. కానీ ప్రోస్టేట్ విషయంలో సర్జరీ అన్ని సార్లు నయం చేయక పోవచ్చు. కొన్ని సార్లు ఎంత ఎక్స్పర్ట్ సర్జన్ అయినా, పూర్తిగా కాన్సర్ ను తీసి వేయలేక పోవచ్చును. అది సర్జరీ చేస్తే కానీ తెలియదు. నీకు జీరో మార్జిన్ రిపోర్ట్ వస్తే మొత్తం తీసి వేసినట్లు. లేకపోతే కొంత కాన్సర్ ఒంట్లో నే ఉన్నందు వల్ల రేడియేషన్ చేయ వలసి వస్తుంది. మా అన్న విషయమే తీసుకో. జీరో మార్జిన్ రాలేదు. రేడియేషన్ ట్రీట్మెంట్ తీసుకున్నాడు. దాని వల్ల సైడ్ ఎఫెక్టులు. ఇంకా డైపర్ వేసుకో వలసి వస్తున్నది. ఎనీవే గుడ్ లక్. తరువాత మాట్లాడుతాను"అని పెట్టేసాడు.

విశ్వం మనస్సు వికల మైంది. ఈ డాక్టర్ సురేష్ తో మాట్లాడక పోయినా బాగుండేది.

ఇంటికి చేరగానే, సీత విశ్వం ముఖచాయలు ఇట్టే పసికట్టేసింది. కాఫీ తాగుతూ, విశ్వం సురేష్ తో జరిగిన సంభాషణ సీతతో పంచుకున్నాడు.

"అందరూ డాక్టర్లు ఒక విధంగా ఉండరు. మనం సురేష్ ను డాక్టర్ గా సంప్రతించడం ఇదే మోదటి సారి. ఆయన మాటల బట్టి చివరిసారి కూడా. డాక్టర్ వెంకటేసులుతో మాట్లాడండి" అంటూ బలవంతంగా ఫోన్ విశ్వం చేతికిచ్చింది.

విశ్వం వెంకటేసులు మంచి స్నేహితులు. వెంకటేసుల విశ్వం ను ఏ మాత్రం బెంబేలు పడాల్సిన పని లేదని,

"ఎవరు నీ యూరోలోజిస్ట్" అని ఆడిగాడు.

విశ్వం పేరు చెప్పగానే

"ఆ పేరు నాకు పరిచయం లేదు. అక్కడ పేరొందిన కాన్సర్ సెంటర్ ఉంది కదా. ఆ సెంటర్ యూరోలోజిస్ట్, డిపార్ట్మెంట్ హెడ్ నాకు తెలుసు. నేను మాట్లాడుతాను. నువ్వు మామూలుగా అపోయింట్మెంట్ తీసుకో. బయాప్సీ కూడా ఆయననే చేయమను. అతనికి మంచి అనుభవం ఉంది. నాపేరు కూడా చెప్పు. నేను అప్పటికే మాట్లాడి ఉంటాను కాబట్టి నిన్ను గుర్తు పట్టగలుతాడు.అన్నీ బాగవుతాయి" అని చాలా ఆశాజనకంగా మాట్లాడాడు.

"కాన్సర్ గురించి నేనడిగిన ప్రశ్నలు ఒకటే. కానీ సురేష్ చెప్పిన మాటలకు, వెంకటేసులు ఇచ్చిన సలహాలు, ధైర్యం కు ఎంత తేడా" తేలిక పడిన మనస్సుతో సీతతో చెప్పాడు.

"అన్నీ బాగానే అవ్వుతాయి. రేపు నేను మీ కోసం ఆ కాన్సర్ సెంటర్ కి ఫోన్ చేసి అప్పాయింట్మెంట్ తీసుకుంటాలెండి" అంది సీత.

విశ్వంకు ధైర్య మైతే చెప్పింది కానీ సీత మనస్సులో తుఫాను గాలులు వీచడం మొదలయ్యాయి. ఈ తుఫాను పర్యవసానం తీరం దాటితే కానీ తెలీదు. ప్రస్తుతం దీని వల్ల ఏ మాత్రం ప్రాణ నష్టం జరగకుండా ఉండేటట్లు చేయు స్వామి, నీ ఏడూ కొండలు కాలి నడకన దాటి నీ దర్శనానికి వస్తాను, అని మనస్సులోనే ఆ తుఫాను హోరులో మొక్కుకుంది సీత.

–6 –

1988.

భారతదేశంలోని సెక్యూరిటీస్ మార్కెట్ ని అదుపు చేసే సంస్థగా సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ అఫ్ ఇండియా ఆవిష్కరణ

పి.ఎల్. మహేష్ ఇద్దరు చెన్నై లోని బ్యాంక్ బ్రాంచ్ వాళ్లతో లెథర్ ఫెయిర్ గురించి ప్రస్తావిస్తే, వాళ్ళు అప్పటికే వాళ్ళ బ్రాంచ్ నుంచి తోళ్లను ఎగుమతి చేస్తున్న మరో వ్యాపారస్తున్ని పరిచయం చేసారు. అలానే సెంట్రల్ లెథర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ అడయార్ రాజ్ భవన్ రోడ్డు లో వుందని, వారి నుండి ఈ లెథర్ ఫెయిర్ గురించి తెలుసుకోవచ్చు నని చెప్పారు.

ఇన్స్టిట్యూట్ వారికి ఫోన్ చేస్తే పొంగల్ టైంలో జనవరి ఫిబ్రవరి మాసాలలో ఈ ఫెయిర్ ఉంటుందని, ప్రపంచంలో నలు మూలాల నుంచి, భారత దేశం లో తయారు అయ్యే తోళ్లను కొనుగోలు కని ఈ ఫెయిర్ కు జనాలు వస్తుంటారని తెలిసింది.

పి.ఎల్. మహేష్ కు తమ కంపెనీ తరపున, డబ్బు కట్టి, ఓ స్టాల్ ఆ ఫెయిర్ లో తీసుకోమని చెప్పాడు. స్టాల్ అలంకరణ, తమ బిజినెస్ గురించిన వివరాలు తెలిపే, పోస్టర్లు, బ్రోచర్లు, విసిటింగ్ కార్డ్స్ ఫెయిర్ నిర్వాహకుల సలహాల ప్రకారం చేయడం వల్ల పి.ఎల్. కంపెనీ స్టాల్ కి కూడా ప్రొఫెషనల్ లుక్ వచ్చేసింది.

అక్కడ స్టాల్స్ పెట్టిన వాళ్ళు చాలా మటుకు, అప్పటికే ఎగుమతులు చేస్తున్న వారు. పి.ఎల్. స్టాల్ కు వచ్చిన విదేశీయులు, ఏవో ఒకటి రెండు ప్రశ్నలు వేసి వెళ్లిపోతున్నారు. అలా వచ్చి వెళ్లిపోయినప్పుడు, కొంచెం చివుక్కని పించినా, వారి దగ్గర నుండి తనకు ఎగుమతి ఆర్డర్ దొరకడం కష్టమేనని తెలుసు. రెండు రోజుల తరవాత, ఓ యువకుడు, తన పేరు లియో అని, చాలా ప్రశ్నలు వేయడం మొదలెట్టాడు. లియో ఇటలీ లోని ఫ్లోరెన్స్ నగరం నుండి వచ్చాడు. పేరున్న కంపెనీనే. కాదంటే అది వాళ్ళ నాన్నది. తను ఓ కొత్త లెథర్ డిజైనర్ కంపెనీ మొదలెట్టి , తన కంటూ ఓ బ్రాండ్ సృష్టించాలని తపన.

పి.ఎల్. కూడా ఇలా ఓ కొత్త పరిచయాన్నే వెదుకుతున్నాడు. కాబట్టి, లియో, పి.ఎల్. అట్టే కలిసిపోవడంలో పెద్ద సమయం పట్టలేదు. మహేష్ కూడా సమర్థవంతంగా ఏర్పాట్లు చేయటంతో, లియో పి.ఎల్. ఫ్యాక్టరీలు చూడడం, పి.ఎల్. కావలసిన తోళ్లు, ఫ్లోరెన్స్ కి ఎగుమతి చేయగలడు, అని నమ్మకం కుదరటం తో , సవేర హోటల్లో కలసి, కాంట్రాక్ట్ కుదుర్చుకుని సంతకాలు చేశారు.

బ్రాంచికి మరుసటి రోజు పోయి కాంట్రాక్ట్ చూపెడితే, బ్రాంచ్ మేనేజర్ తెగ సంతోష పడి, ఎగుమతి కని కొత్త అకౌంట్లు తెరవ మని సలహా ఇచ్చి, ఇది వరకే పరిచయం చేసిన చెన్నై లెథర్ ఎక్సపోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అధినేత షరీఫ్ ను మరో సారి కలవ మన్నాడు.

షరీఫ్, పిల్.ఎల్. చెప్పిన మాటలు విని అతనిని అభినందించాడు. లియో ది ఇటలీ నుంచి కొత్త కంపెనీ కాబట్టి, పి.ఎల్. చర్యల వల్ల తన కంపెనీకు నష్టమేమీ రాదని తెలుసు. షరీఫ్ కు తాను తొలిరోజులలో ఎగుమతులు చేయడానికి పడ్డ కష్టాలు గుర్తుకు వచ్చాయి. పి.ఎల్. ను చూస్తుంటే తనని చూస్తున్నట్లే ఉంది. పి.ఎల్. కు మెంటర్ అయ్యి, అతనికి బ్రేక్ ఇవ్వాలని, తన శిష్యుడి గా మార్చుకోవాలి అనిపించింది.

షరీఫ్ కాంట్రాక్ట్ చదివాడు.

"పి.ఎల్. కంగ్రాట్స్. మహేష్ ను మా కంపెనీ అకౌంటెంట్ తో పని చేయ మని చెప్పు. మొదటి ఎగుమతి చాలా జాగ్రత్తగా చేయాలి. ఆ మొదటి ఎగుమతి పైనే మీ భవిష్యత్తు ఆధార పడి ఉంటుంది. ముందు మీరు లియో వాళ్ళ కంపెనీ ని , పిల్.ఎల్. లెథ ర్ ఎక్సపోర్ట్స్ పేరు మీద ఓ లెటర్ ఆఫ్ క్రెడిట్ తెరవమని చెప్పు. నీ వు వెంటనే విదేశాలలో కొత్త అకౌంట్లు తెరవాలి" అన్నాడు.

"థాంక్స్ షరీఫ్ గారు. మహేష్ తో మాట్లాడుతాను" అన్నాడు పి.ఎల్.

"ఎగుమతులు కాబట్టి, మరిన్ని తలనొప్పులుంటాయి. చెన్నై పోర్ట్ లో నువ్వు ఎగుమతి చేస్తున్న వస్తువుల ను ఇన్స్పెక్షన్ చేసి కాని ఎగుమతి చేయనివ్వరు. దానికి క్లియరింగ్ ఏజెంట్లు కావాలి. వాళ్లే నీ వస్తువుల ను పరీక్ష చేయించి , బిల్ ఆఫ్ లేడెన్ మీద సర్టిఫై చేసినట్లు సంతకం పెట్టిస్తారు. లియో కంపెనీ వాళ్ళు తెరిచిన లెటర్ ఆఫ్ క్రెడిట్, నీవు లియో కంపెనీకి పంపుతున్న ఇన్వాయిస్, క్లియరింగ్ ఏజెంట్లు ఇచ్చిన బిల్ ఇఫ్ లేడెన్ , షిప్పింగ్ బిల్ ఉంటే కానీ బ్యాంక్ వాళ్లు నీ ఎగుమతి ని అప్రూవ్ చేసి ఇక్కడ చెన్నై లో నీ అకౌంట్లో డబ్బు జమ చేయరు. అన్నట్లు నీవు ఫ్లోరెన్స్ లోను, స్విట్జర్లాండ్ లోని జెనీవా నగరంలోను అక్కడి బ్యాంకులలో కొత్త అకౌంట్లు తెరవాలి. మా అకౌంటెంట్ మీ మహేష్ కు అన్ని వివరించగలడు. నీవు, మహేష్ ఇన్వాయిస్ చేసే ముందు, నన్ను, నా అకౌంటెంట్ ను ఓ సారి కలవండి. మంచి సలహాలు ఇవ్వగలం"అన్నాడు షరీఫ్.

ఓ నెల తరువాత, మహేష్, పి.ఎల్ ను కలవడానికి వచ్చాడు. మొదటి ఎగుమతి ఇటలీ లోని లియో కంపనీ కి చేస్తున్నారు కాబట్టి, కొంచెం హడావిడిగానే ఉంది.

"ఏంటి మహేష్ ఎగుమతి కావలసిన ఏర్పాట్లు అన్నీ అయ్యాయ? ప్రొడక్షన్ లో అయ్యితే సమస్యలు ఏమి లేవు. తప్పకుండా, ఎగుమతికి రెడీ గా ఉంటాయి" అన్నాడు పి.ఎల్.

"పోర్ట్ లో ఏర్పాట్లు అన్నీ ముగిసాయి. వచ్చే నెలాఖరులో చెన్నై నుంచి లివొర్నో పోర్టుకు పోయే ఓడ ఒకటుంది. క్లియరింగ్ ఏజెంట్లు ఆ ఏర్పాట్లని చూసుకుంటారు. సమస్య బిల్లు విషయంలోనే ఉంది. మీరన్నట్లు షరీఫ్ వాళ్ళ కంపనీ కి వెళ్లి, వారు చేస్తున్న ఎగుమతి లావా దేవిలు చూసాను" అన్నాడు మహేష్.

"మరి సమస్య ఎక్కుడుంది" నిస్పృహనంగా అడిగాడు పి.ఎల్.

"షరీఫ్ కంపనీ వాళ్లు మనం ఒప్పుకున్న మొత్తానికంటే, తక్కువగా బిల్ చేయమంటున్నారు. వాళ్ళు అలానే చేస్తున్నారు. నేను వాళ్ళ అకౌంట్లు చూసాను" అన్నాడు మహేష్

"అంటే అండర్ ఇన్వోయిసింగ్ అన్న మాట. అలా చేస్తే నష్టం కదా. దాని వల్ల మనకు లాభం ఏంటి?" అడిగాడు పి.ఎల్.

"నేనూ అదే ప్రశ్నించాను. వాళ్లన్నది, ఇది బ్యాంక్ లావా దేవిలకేనని. లియో వాళ్ళ కంపనీ మనం రాసుకున్న కాంట్రాక్ట్ ప్రకారమే మనకు డబ్బు అంద చేస్తారు. కాదంటే మనం బ్యాంక్ ద్వారా 70% కి మాత్రమే బిల్ చేస్తాము కాబట్టి, అంత మాత్రమే మనకు బ్యాంక్ ద్వారా మన దేశానికి తిరిగి వస్తుంది. మిగిలిన 30 శాతం స్విట్జర్లాండ్ లో మనం కొత్తగా ఓ అకౌంట్ ఓపెన్ చేసి, లియో వాళ్ళ కంపనీని, ఆ అకౌంట్ లో జమ చేయమని చెప్పాలి" అన్నాడు మహేష్.

వచ్చిన ఆదాయంలో 70 శాతంమాత్రమే చూపితే, ఆదాయ పన్ను తగ్గుతుందని తెలుసు. స్విట్జర్లాండ్ లో ఉన్న డబ్బు వల్ల ఉపయోగం ఏంటో పూర్తిగా అర్థం కాలేదు. అదే ఆడిగాడు పి.ఎల్.

"స్విట్జర్లాండ్ ఖాతాలో ఉన్న డబ్బు విలువ ఎక్కువే అంటున్నారు. ఇక్కడ రిజర్వ్ బ్యాంక్ రూల్స్ తెలిసినవే కదా. విదేశీ కరెన్సీ కావాలంటే చాలా కష్టం. అలాంటి కరెన్సీ కావాల్సిన వారు చాల మంది ఉన్నారట. అలానే ఆ ఖాతా లోని డబ్బు మన దేశం లో కావాలన్నా, ఇక్కడే రూపాయల్లో ఇచ్చే వారున్నారట. ఆ ఇచ్చేది కూడా మన బ్యాంక్ వాళ్లు ఇచ్చే

దాని కంటే ఎక్కువ ఇస్తారట. అదేదో హవాలా వాళ్ళన్నారు. షరీఫ్ గారే మీకు ఆ హవాలా వాళ్ళను పరిచయం చేస్తానన్నారు. మీరు షరీఫ్ తో ఓ సారి మాట్లాడండి " అన్నాడు మహేష్.

పి.ఎల్. మనస్సులోనే లెక్కలు వేసాడు. పన్నులు తక్కువ కట్టడం వల్ల ఓ 20 శాతం, హవాలా వారి ద్వారా డబ్బు మార్పించడం వల్ల అక్కడో 10 శాతం లాభాలు ఎక్కువ రావాలి. పి.ఎల్ కు ఏమి ఆక్షేపణలు కనపడ లేదు. అప్పటికే బాగా నిలదొక్కుకున్న, షరీఫ్ కంపెనీలు పోతున్న దారులలో పోవడం విజయానికి మెట్లే.

అదే మాట మహేష్ కు చెప్పాడు

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments